డ్రైవర్ల ఆటోపోట్లు!

- ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమయ్యాక తగ్గిన ఆదాయం
- ఆటోడ్రైవర్ల ఆందోళన
- ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు



మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఆటోడ్రైవర్ల నిరసన

నార్నూర్: రాష్ట్రప్రభుత్వం గత డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా భారీ స్పందన వస్తోంది. మహిళలంతా బస్సులను ఆశ్రయించడంతో షేరింగ్ ఆటోలకు గిరాకీ తగ్గింది. ఆటోల డీజిల్, సీఎన్‌జీ ఖర్చులు పోగా డబ్బులు మిగలడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. రాష్ట్రప్రభుత్వం తమకు ఏదైనా ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపడుతున్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లో గతంలో ఆర్టీసీ సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉండడంతో ప్రతీ ప్రయాణికుడు ఆటోల మీదనే ఆధారపడేవాడు. ఈ మండలాల్లో ఆటోల సంఖ్య భారీగా ఉంది. ఎక్కువ మంది ప్రయాణికులను చేరవేసే షేరింగ్, ప్యాసింజర్ ఆటోలు సుమారు 600పైనే ఉన్నాయి. వీటితో బస్సులు నడవని మార్గాల్లో పట్టణాల నుంచి పల్లెల నుంచి వచ్చే ప్రయాణికులకు వారి గమ్యాన్ని చేరుస్తూ డ్రైవర్లు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి మహిళల నుంచి ఆశించిన స్థాయిలో గిరాకీ లేక సతమతమవుతున్నారు.

మండలాల్లో పరిస్థితి ఇలా..

నార్నూర్, గాదిగూడ మండలాల్లో సుమారు 600పైగా ఆటోలు ఉన్నాయి. నార్నూర్ మండలానికి సరైన బస్సు సౌకర్యాలు లేక ప్రతీరోజు ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించి 25 కి.మీ దూరంలో ఉన్న ఉట్నూర్ వెళ్లేవారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో మండలానికి బస్సుల సంఖ్య పెంచడంతో ఆటోడ్రైవర్ల పరిస్థితి దారుణంగా తయారైంది. రోజుకు కనీసం రూ.200 రావడం లేదని ఆటోడ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఆటోఫైనాన్స్ కట్టలేక కుటుంబాన్ని పోషించుకోలేక సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఆసరా కల్పించాలని కోరుతున్నారు.

రూ.300 మిగలడం లేదు



మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లేనప్పుడు అన్నిఖర్చులు పోను రూ.700 మిగిలేవి. ఇప్పుడు రూ.300 రావడం లేదు. ఆటో ఈఎంఐ చెల్లించేందుకు రోజు రూ.300 చొప్పున పక్కనపెట్టాలి. పిల్లల ఫీజు, ఇంటి అద్దె, నిత్యావసర సరుకులు సరిపోక అప్పు చేయాల్సి వస్తోంది.

– షేక్ ఛోటు, ఆటోడ్రైవర్, నార్నూర్

కష్టమవుతుంది



గతంలో నార్నూర్ నుంచి ఉట్నూర్‌కు మూడు ట్రిప్పులకు రూ.700 వరకు మిగిలేవి. ఆర్టీసీ బస్సులు ఉచితమైనప్పటి నుంచి రూ.200 రావడం లేదు. ఆటోలో మహిళలు ఎక్కడం లేదు. రోజు ఆటో అద్దె రూ.300 చెల్లించడం కష్టమవుతుంది.

– మాడవి లింబారావు, ఆటోడ్రైవర్, నార్నూర్

పట్టించుకోవాలి



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఆటోడ్రైవర్లకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఆటోలనే నమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నా ఆటోడ్రైవర్లను ప్రభుత్వం పట్టించుకోవాలి. వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలి.

– ఫెరోజ్‌ఖాన్, ఆటో యూనియన్ అధ్యక్షుడు

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందించాలి

ఆదిలాబాద్‌రూరల్: అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందించాలని మావల ఎంపీపీ దర్శనాల సంగీత అన్నారు. మావల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు గత మూడు నెలలో వారి శాఖల్లో చేపట్టిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. అనంతరం గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం చేసేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో సునీత, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో లక్ష్మణ్, మావల, వాఘాపూర్ సర్పంచులు దొగ్గలి ప్రమీలా, మడావి మయూరి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా బేగం జయంతి



జయంతి వేడుకల్లో నాయకులు

ఉట్నూర్‌రూరల్: భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా బేగం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సామాజిక విద్యార్థి , ఆదివాసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉట్నూర్ ఉర్దూ పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞశీల్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం ఉపేందర్, టీఎస్ఎస్ఓ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజుతోపాటు నాయకుడు జుబేర్‌ఖాన్, ప్రిన్సిపాల్ అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతక్కను కలిసిన బీజీఆర్



సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజీఆర్

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు బాలురి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సీతక్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు సంబంధించిన సమస్యలతోపాటు పలు రాజకీయ అంశాలపై మంత్రితో చర్చించినట్లు బీజీఆర్ తెలిపారు. ఆయన వెంట నాయకులు దుర్గే నారాయణ ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలందిస్తాం

బోథ్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తామని ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండలంలోని పట్నాపూర్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య ఉపకేంద్రానికి ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించామన్నారు. సర్పంచ్ పంద్రం సుగుణ, వైస్ ఎంపీపీ లింబాజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

మండలంలోని దేవన్నపల్లె, నేరేడుపల్లె, చింతగూడ గ్రామాల్లోని పలు కుటుంబాలను ఎంపీ సోయం బాపూరావ్ పరామర్శించారు. ఈ సందర్భంగా నేరేడుపల్లె గ్రామంలో రూ.2 లక్షలతో రోడ్డు వేయిస్తామన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో డిపో మేనేజర్ కల్పనకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆదిలాబాద్ నుంచి లాండసాంగ్వి మీదుగా అర్లి(టి), అడ, కంట గ్రామాల వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడిపేవారని పేర్కొన్నారు. బస్సు సర్వీసు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా ఆదిలాబాద్ నుంచి పిప్పల్‌ధరి వరకు, అంకోలి, తంతోలి, వాన్వట్ గ్రామాలకు 9 ట్రిప్పులు నడపాలని విన్నవించారు. కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి కిషన్, అల్లూరి రమేశ్‌రెడ్డి, భీంరావ్, భూమన్న, సాగర్, దేవన్న గంగన్న, సోనేరావు ఉన్నారు.

కొత్త నిధులతో అభివృద్ధి పనులు చేయాలి



మాట్లాడుతున్న ఠాక్రే మంగేష్

బేల: మండలంలోని ఉపాస్నాలలో అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించగా, మళ్లీ ప్రస్తుత ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూమిపూజ చేయడం సమంజసం కాదని బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు ఠాక్రే మంగేష్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాస్నాలలో పాత పనులైన ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూమి పూజ చేయడం సరికాదన్నారు. కొత్త నిధులతో అభివృద్ధి పనులు చేపడితే స్వాగతిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఠాక్రే గంభీర్, సతీశ్‌పవార్, ప్రమోద్‌రెడ్డి, సాదిక్, గోడం సునీల్, గొడే విశాల్ తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనంగా అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద అదనంగా ఎకరం భూమిని కొనుగోలు చేసి స్మృతివనంగా అభివృద్ధి చేయాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భరత్, జిల్లా కార్యదర్శి సోయం రాందాస్ డిమాండ్ చేశారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం వారు నివాళులర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. అమరవీరుల స్తూపాన్ని స్మృతివనంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీపై 9 తెగల ఆదివాసీలు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, ఆదివాసీ పెద్దలు చహకటి నాగోరావ్, మెస్రం భారత్, పృథ్వీరాజ్, మురహరి, ఉయిక రవి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



దక్షిణ మధ్య రైల్వే ఏజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సామ రూపేష్‌రెడ్డి

ఆదిలాబాద్: మావల మండలం బట్టిసవర్గం శివారు ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను మంగళవారం సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ధనుంజేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బట్టి సవర్గాం గ్రామానికి ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 84/3లో 6.38 ఎకరాలు ఉన్నాయన్నారు. ఇందులో ఐదెకరాలు ఇతరుల పేరుపై, మరో 1.1ఎకరా భూమి అప్పటి ప్రభుత్వం రైల్వేశాఖకు కేటాయించిందని తెలిపారు. ఆ భూమిని అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు అక్రమార్కులు కబ్జా చేసి అందులో లే అవుట్ చేసి అమ్మకానికి పెట్టారని పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన ఏజీఎం.. విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మావల మండల అధ్యక్షుడు శేఖర్, బేల మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు విపిన్ ఠాక్రే, బోర్కె శంకర్, ముత్యాల సురేష్ ఉన్నారు.

రైళ్ల సంఖ్యను పెంచాలి

ఆదిలాబాద్‌కు రైళ్ల సంఖ్యను పెంచాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ.రమణ కోరారు. మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏజీఎం ధనుంజేయులుకు వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు.

ఐదు రకాల గాజుల ప్రచారం !

ఆదిలాబాద్‌టౌన్: సంక్రాంతి కీడు వచ్చిందని.. ఒక కొడుకున్న ఉన్న తల్లులు పండుగకు గాజులు వేసుకోవాలని దుష్ప్రచారం జరుగుతోంది. చాలా మంది మహిళలు నమ్మి ఐదు రకాల గాజుల ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. ఒక్క కొడుకు ఉన్నవారు ఇద్దరు కొడుకులు ఉన్న ఇంటికెళ్లి గాజుల కోసం డబ్బులు అడిగి గాజులు కొనుక్కొని వెంటనే వేసుకోవాలని మహిళలు నమ్ముతున్నారు. దీంతో గాజుల షాపుల్లో మహిళల తాకిడి పెరిగింది. వేద పండితులు తప్పుడు ప్రచారమని చెబుతున్నారు.

మహిళా సంఘాలు పటిష్టం

- ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం
- అతివలకు ఎంతో ప్రయోజనం

జిల్లాలో..

స్వయం సహాయక సంఘాలు	10,750
సంఘాల్లోని సభ్యులు	1,16,711
గ్రామ సమాఖ్యలు	557

అంశం	మార్కులు
ప్రతినెలా రెండు సార్లు సమావేశాల నిర్వహణ	5
సమావేశానికి పూర్తిస్థాయి సభ్యుల హాజరు	10
ప్రతినెలా పొదుపు చెల్లింపులు	10
క్రమం తప్పకుండా రణ వాయిదాల చెల్లింపులు	8
సీఐఎఫ్ (సామాజిక పెట్టుబడి నిధి)	13
స్త్రీనిధి అప్పు చెల్లింపు	32
తమ సంఘానికి చెల్లించాల్సిన రుణ వాయిదాలు	5
బ్యాంకు అప్పు తిరిగి చెల్లింపు	17



వడూర్ గ్రామంలో సమావేశమైన సంఘాల మహిళలు (ఫైల్)

నేరడిగొండ: మహిళా సంఘాలను మరింత పటిష్టం చేయాలన్న లక్ష్యంతో గ్రేడింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు గ్రామైక్య సంఘాలకు మాత్రమే ఈ విధానం ఉంది. ఏ,బీ,సీ గ్రేడింగ్‌లో ఉన్న గ్రామ సమాఖ్య సంఘాలకే స్త్రీనిధి రుణాలు కేటాయిస్తున్నారు. ఇక మీదట క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకు ఇదే నిబంధన వర్తించనుంది. గ్రేడింగ్‌లో వెనకబడితే బ్యాంకు, స్త్రీనిధి రుణాలు అందడం కష్టమే.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించడమే కాకుండా స్వయం ఉపాధికి బాటలు వేస్తోంది. సంఘాల్లో సభ్యులు అనుభవం ఉన్న రంగాల్లో రాణించేందుకు ప్రత్యేక రుణాలు మంజూరు చేస్తున్నారు. బ్యాంకుతోపాటు స్త్రీనిధి రుణాలు అందుతుండటంతో ఆర్థిక సమస్యలను అధిగమించే దిశగా మహిళా సంఘాల సభ్యులు ముందుకు సాగుతున్నారు. మహిళా సంఘాలకు 12 అంశాల ఆధారంగా ఏ,బీ,సీ,డీ గ్రేడింగ్‌లు కేటాయిస్తున్నారు. ఒక్కో సంఘం 75 శాతానికి పైగా మార్కులు సాధిస్తే 'ఏ'గ్రేడ్, 75 నుంచి 60 మధ్య 'బీ'60 నుంచి 50 లోపు 'సీ'59 శాతం కన్నా తక్కువ మార్కులు సాధిస్తే 'డీ' గ్రేడింగ్‌గా నిర్ణయిస్తున్నారు.


సంఘాల సభ్యులకు మేలు



గ్రేడింగ్ విధానంతో సంఘాల్లోని సభ్యులకు ఎంతో మేలు జరగనుంది. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి అమలు చేస్తున్నాం. సమావేశాలు పక్కాగా నిర్వహించడంతోపాటు గ్రేడింగ్‌లో వెనకబడకుండా సంఘాల వారీగా నివేదికలపై సమీక్ష నిర్వహిస్తున్నాం. సమావేశాలు నిర్వహించడంతో ఎస్ఆర్ఎల్ఎం ఫండ్ 3 శాతం సంఘాలకు వస్తుంది. బ్యాంకు, స్త్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లించేందుకు పర్యవేక్షణ చేస్తున్నాం.

– హేమలత, డీఆర్‌డీఏ ఐబీ, ఆదిలాబాద్

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ



ఇచ్చోడ: సుభాష్‌నగర్‌లో అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

జైనథ్: మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన అక్షింతలను, శ్రీరాముని చిత్రపటాలతో గ్రామ ప్రధాన వీధులగుండా శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. సర్పంచ్ దుమాల దేవన్న, ఎంపీటీసీ సుదర్శన్, ఉప సర్పంచ్ రాకేశ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్: అయోధ్య అక్షింతలను రాజులగూడ గ్రామస్తులు మంగళవారం పాదయాత్రగా నార్నూర్ హనుమాన్ మందిరం వరకు తీసుకువచ్చారు. సర్పంచ్ రాథోడ్ సావీందర్, గ్రామ నాయక్ రాథోడ్ డిగాంబర్, గ్రామపెద్దలు రూప్‌దేవ్ రాథోడ్ గణేశ్, జాదవ్ బాపురావు, జాదవ్ బన్సీలాల్, రాథోడ్ జైవంతరావు, విష్ణు రాథోడ్, పవార్ గోవింద్, అడే మోహన్, రాథోడ్ సుభాష్ ఉన్నారు.

ఇచ్చోడ: అయోధ్య అక్షింతల పంపిణీ కొనసాగుతోంది. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అక్షింతలు పంపిణీ చేశారు. కుంభోజి సంతోష్, కేంద్రే ప్రకాశ్, బత్తుల రవి, శివరాత్రి గోపి, అలకుంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

13న సన్నాహక సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఫిబ్రవరిలో నిర్వహించనున్న ఆదివాసీ ధర్మగురువు హీరా సుక్కా జయంతి సందర్భంగా ఇంద్రవెల్లిలో ఈనెల 13న సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడహక్ కమిటీ సభ్యులు పూసం ఆనంద్ రావ్, ఆత్రం అనుసూయ తెలిపారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హీరాసుక్కా జయంతి విజయవంతానికి ముందుగా నిర్వహిస్తున్న సమావేశానికి జిల్లాలోని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ మండల బాధ్యులు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకులు పాల్గొనాలని కోరారు.

ఆరు గ్యారంటీలపై ప్రచారం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద, గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆరు గ్యారంటీలపై ప్రచారం నిర్వహించారు. పాటల రూపంలో వివరించారు. కళాకారులు బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఇచ్చోడ: ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఇచ్చోడ, మన్నూర్ కేంద్రాల్లో సీసీఐ ద్వారా బుధవారం నుంచి 15వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు కార్యదర్శి రమేశ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్తి నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈనెల 16న తిరిగి కొనుగోళ్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

తాంసి: భీంపూర్ మండల కేంద్రానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం విచ్చేస్తున్నట్లు బీఆర్ఎస్ కన్వీనర్ నాగయ్య తెలిపారు. భీంపూర్‌లో ఉదయం 11 గంటలకు విద్యావనరుల కేంద్రం భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారని వివరించారు.

క్లుప్తంగా

బీజేపీలో చేరిన సినీనటుడు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న అభినవ్ సర్దార్

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన సినీనటుడు అభినవ సర్దార్ మంగళవారం బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీకి ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ

తలమడుగు: సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీకి చెందిన తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శాలువతో సత్కరించారు. నూతన సంవత్సరం, సీఎంగా నెల రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సేవాలాల్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి



దరఖాస్తు అందజేస్తున్న జాదవ్ మహేందర్

నేరడిగొండ: ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు సెలవు ప్రకటించాలని గిరిజన లంబాడిల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మొదటిసారిగా ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. అలాగే ఫిబ్రవరి 15న క్యాలెండర్‌లో సైతం ఎక్కించాలని కోరారు. ఆయన వెంట లైవ్ నాయకులు పాండు తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

తలమడుగు: యుటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాత్లె నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ విజయ్, ఉపాధ్యక్షులుగా ఎస్.చిన్నయ్య, కె.ప్రజ్ఞజ్యోతి, కోశాధికారిగా రాథోడ్ రవీందర్, కార్యదర్శులుగా కె.లింగన్న, కె.శంకర్, సురేష్, కె.విజయ కుమారి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కాంతారావు, సభ్యులుగా విజయ్‌సింగ్, దివాకర్, పత్రికా కన్వీనర్‌గా శంకర్‌రావు, సాంస్కృతిక కన్వీనర్‌గా కె.ఆనందరావు, మహిళా కన్వీనర్‌గా ఎస్.లక్ష్మి, సోషల్ మీడియా కన్వీనర్‌గా అనిల్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అశోక్ వ్యవహరించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కృష్ణవేణి

ఆదిలాబాద్‌రూరల్: చట్టాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని మహిళా శిశుసంక్షేమ శాఖ మహిళా సాధికారత స్పెషలిస్టు కృష్ణవేణి అన్నారు. మండలంలోని బంగారుగూడ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. అనుకున్న లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా ముందుకెళ్లాలని సూచించారు. స్పెషలిస్ట్ కోటేశ్వర్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ వైద్యశిబిరం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామడిగౌరీ గ్రామంలో అంకోలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం సికిల్‌సెల్ వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో 34 ఆదివాసీ కొలాం గిరిజన కుటుంబాలు ఉండగా 79 మందికి వైద్యసిబ్బంది సికిల్‌సెల్ పరీక్షలు చేశారు. అందులో 41 మందికి రక్తపరీక్షలు చేసి మాత్రలు అందజేశారు. ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, పవర్ ప్రేంసింగ్, సిబ్బంది ముయ్యాల మోతి, రోహిదాస్, తదితరులు ఉన్నారు.